# బిడ్డర్ల నిర్లక్ష్యం.. 3 వేల కోట్ల భారం!

- అయినా, గడువు పెంపునకే పౌరసరఫరాల సంస్థ మొగ్గు!
- వేలం ధాన్యం తరలింపునకు 23తో ముగియనున్న గడువు
- తరలించింది 20శాతం లోపే
- 3 నెలల పొడిగింపునకు బిడ్డర్ల లాబీయింగ్
- జీవో విడుదలకు రంగం సిద్ధం
- పొడిగిస్తే సివిల్‌సప్లైకి భారీ నష్టం



హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): వేలం పాటలో దక్కించుకున్న ధాన్యం తరలింపు విషయంలో బిడ్డర్లు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం పౌర సరఫరాల సంస్థకు శాపంగా మారుతున్నది. వేలం ధాన్యం తరలింపు ఆలస్యమైనా కొద్దీ పౌరసరఫరాల సంస్థపై వడ్డీల భారం పెరిగిపోతున్నది. అయినప్పటికీ, వేలం లో విక్రయించిన ధాన్యం లిఫ్టింగ్ (ఎత్తేందు కు) గడువును మరో మూడు నెలలపాటు పొడిగించేందుకు పౌరసరఫరాల సంస్థ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను ఇప్పటికే సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్న ట్టు తెలిసింది. అదే జరిగితే పౌరసరఫరాల సంస్థపై పడుతున్న వడ్డీల భారం రూ.మూడు వేల కోట్లకు చేరుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. నిజానికి వేలం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు బిడ్డర్లకు ఇచ్చిన 90 రోజుల గడువు ఈ నెల 23తో ముగియనున్నది. కానీ, బిడ్డర్లు ఇప్పటివరకు 20 శాతం ధాన్యాన్ని మాత్రమే తరలించినట్టు తెలుస్తున్నది. మిగిలిన ధాన్యాన్ని తరలించే గడవును మరో 3నెలల పాటు పొడిగించాలని బిడ్డర్లు ప్రభుత్వం వద్ద పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టు చర్చ జరుగుతున్నది. ఈ వ్యవహారం పౌరసరఫరాల సంస్థలో హాట్‌టాపిక్‌గా మారింది. సంస్థకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నప్పటికీ గడువు పెంపునకే ఎందుకు మొగ్గు చూపుతున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించిన 35 లక్షల టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ఫిబ్రవరిలో వేలం వేయగా, 4 కంపెనీలు దక్కించుకున్నాయి. వీరికి ఫిబ్రవరి 23న వేలం కన్ఫర్మేషన్ లెటర్‌ను అందించింది. ఈ లెటర్ అందిన తేదీ నుంచి 90 రోజుల్లోగా మిల్లుల్లోని ధాన్యాన్ని మొత్తం ఖాళీ చేయాలని స్పష్టంచేసింది. ఇప్పటివరకు సుమారు 20% లోపు ధాన్యం మాత్రమే తరలించినట్టు తెలిసింది. దీంతో మిగిలిన ధాన్యం తరలించే గడువును మరో మూడు నెలలపాటు పొడిగించాలని బిడ్డర్లు పౌరసరఫరాల సంస్థను కోరినట్టు తెలిసింది. ఇందుకోసం బిడ్డర్లు లాబీయింగ్ చేస్తున్నారని, 'పెద్దలందర్నీ' సంప్రదించి 'సెట్'చేసే పనిలో పడినట్టు పౌరసరఫరాల సంస్థలో జోరుగా చర్చ జరుగుతున్నది. గడువు పెంపు దాదాపుగా ఖరారైందని, ఉత్తర్వులు వెలువడటమే ఆలస్యమని తెలిసింది.

### సివిల్ సప్లై పై 3 వేల కోట్ల వడ్డీ భారం

ఒకవైపు, పౌరసఫరాల సంస్థ సుమారు రూ.70 వేల కోట్ల అప్పుల్లో ఉన్నదని ప్రభుత్వం చెప్తున్నది. ఈ అప్పులను తగ్గించే చర్యలు చేపట్టకుండా మరింత పెంచేలా వ్యవహరిస్తున్నదనే విమర్శలున్నాయి. వేలం వేసిన ధాన్యం లిఫ్టింగ్ గడువును మరో మూడు నెలలపాటు పొడిగిస్తే సంస్థకు భారీ మొత్తంలో ఆర్థిక నష్టం కలుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. వేలంలో విక్రయించిన ధాన్యం విలువ సుమారు రూ.7 వేల కోట్లు. కానీ, బిడ్డర్లు ధాన్యం ఎత్తడంలో నిర్లక్ష్యం వహించడంతో ఈ డబ్బులు పౌరసరఫరాల సంస్థకు అందలేదు. దీంతో పౌర సరఫరాల సంస్థపై నెలకు కనీసం రూ.500 కోట్ల చొప్పున వడ్డీల భారం పడుతున్నది. గడిచిన మూడు నెలలకు పౌర సరఫరాల సంస్థపై దాదాపు రూ.1,500 కోట్ల మేర వడ్డీల భారం పడగా, గడువును మరో మూడు నెలలపాటు పొడిగిస్తే ఈ భారం రూ.3 వేల కోట్లకు చేరుతుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ధాన్యం వేలం వేసిన డబ్బులు రాకపోగా, వడ్డీ భారం కూడా సంస్థపై పడటంతో మరింత ఆర్థికనష్టం పెరిగే అవకాశం ఉన్నది. ప్రభుత్వానికి అప్పులు తగ్గించాలనే చిత్తశుద్ధి ఉంటే.. ఈ విధంగా చేయబోదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### మిల్లర్లతో బేరసారాలు

ధాన్యం ఎత్తడంలో బిడ్డర్లు కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విలువ పడిపోవడంతో ఇప్పుడీ ధాన్యం ఎత్తితే నష్టం వస్తుందనే ఆలోచనలో వారు ఉన్నట్టు తెలిసింది. అందుకే కాలయాపన చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీనికి తోడు ధాన్యం ఎత్తడం, ట్రాన్స్‌పోర్ట్ పెట్టి ఎక్కడో విక్రయించడం.. ఇలాంటి తలనొప్పుల కన్నా.. ఎక్కడి ధాన్యం అక్కడే ఉంచేసి పేపర్లపై అమ్మకాన్ని చూపించేవిధంగా బిడ్డర్లు ప్లాన్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ధాన్యం ఉన్న మిల్లర్లతో బిడ్డర్లు బేరసారాలు సాగిస్తున్నట్టు తెలిసింది. 'మీ ధాన్యం మీ దగ్గరే ఉంచుకోండి. ఆ ధాన్యానికి ఎంత ధర అవుతుందో అంత మొత్తం మాకు చెల్లించండి' అంటూ ప్రతిపాదనలు పంపుతున్నట్టు మిల్లర్ల వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ మిల్లర్ల వద్ద ధాన్యం లేకుంటే ముక్కుపిండి మరీ అందుకు సంబంధించిన డబ్బులను వసూలు చేస్తున్నట్టు తెలిసింది. ఈ విధంగా ధాన్యం ఎత్తకుండానే ఎక్కడి ధాన్యం అక్కడే ఉండగానే మొత్తం కార్యక్రమం పూర్తి చేసే విధంగా భారీ స్కెచ్ వేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ములుగురూరల్ : తడిసి మొలకలు వచ్చిన వడ్లు

# సీఎం చెప్తే మాకేంటి?

మొదటిపేజీ తరువాయి...

చెప్తున్నారు. ఆరబెట్టి తీసుకొస్తేనే కాంటా పెడతామని స్పష్టంగా చెప్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం చెప్పారు కదా అని రైతులు ప్రశ్నిస్తే, అవన్నీ అనవసరమని, నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్నే కొనుగోలు చేస్తామని అధికారులు తెగేసి చెప్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతున్నా, మొలకెత్తుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. ఏడువేలకు పైగా కేంద్రాలు ఏర్పాటు చేసి వేగంగా ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం సుమారు 5వేల కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటి వరకు 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిసింది.

### ఎండకు ఎండి.. వానకు తడిసి

ఓ రైతు వారం రోజులు కష్టపడి ధాన్యాన్ని ఆరబెట్టాడు. కాంటా పెట్టడంలో అధికారులు ఆలస్యం చేశారు. వర్షం రావడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. ఆ ధాన్యాన్ని కాంట పెట్టాలంటే మళ్లీ ఆరబెట్టాల్సిందేనని అధికారులు చెప్పడంతో ఆ రైతు మళ్లీ ధాన్యాన్ని ఆరబెట్టాడు. తర్వాత మళ్లీ వర్షం పడి తడిసిపోయింది. రాష్ట్రంలోని మెజార్టీ కొనుగోలు కేంద్రాల్లోని పరిస్థితి ఇది. ధాన్యం ఆరబెట్టగానే కొనుగోలు చేస్తే రైతులకు ఈ ఇబ్బందులు తప్పేవి. అధికారుల నిర్లక్ష్యం, కొనుగోలు కేంద్రాల్లోని ఇతర సమస్యలు రైతులకు శాపంగా పరిణమిస్తున్నాయి.

### మిల్లుల్లో చోటేదీ?

ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యానికి మిల్లుల్లో చోటు లేకపోవడం కూడా కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే గత యాసంగి ధాన్యం, గత వానకాలం ధాన్యంతో మిల్లులన్నీ నిండిపోయాయి. ఈ యాసంగి ధాన్యం పెట్టేందుకు చోటు లేకుండా పోయింది. మొన్నటి వరకు మిల్లర్లు ఎలాగోలా కొంత ధాన్యాన్ని దించుకున్నప్పటికీ ఇప్పుడు పూర్తిగా చోటు లేకపోవడంతో దించుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఈ కారణంతో పలు జిల్లాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు కొన్ని జిల్లాల్లో ధాన్యాన్ని అధికారులు ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని కొంత ధాన్యాన్ని సిద్దిపేట జిల్లాలోని మిల్లులకు తరలిస్తున్నారు.

### దయనీయంగా రైతుల పరిస్థితి

ఓవైపు కొనుగోలులో ఆలస్యం, మరోవైపు వరుస వర్షాలతో అన్నదాత పరిస్థితి ఆగమాగం అవుతున్నది. వరుసగా కురుస్తున్న వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. భారీ వర్షాలకు కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఒడిసిపట్టేందుకు రైతులు పడుతున్న కష్టాలకు అంతేలేకుండా పోతున్నది. బహిరంగ ప్రదేశాల్లో ఆరబెడుతున్న ధాన్యం వర్షాలకు తడిసి ముద్దవుతున్నది. ఆ తర్వాత కూడా ఆరే పరిస్థితి లేకపోవడంతో ధాన్యం మొలకెత్తి రైతన్నకు గుండె కోత మిగిలిస్తున్నది.



## తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు ఎందుకు కొనరు?

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రాష్ట్రంలో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. సోమవారం జరిగే క్యాబినెట్ సమావేశంలో రైతులను ఆదుకునేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వడ్లను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిద్రాహారాలు మాని పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదారు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ ముందస్తు సమాచారం ఇచ్చినా వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడం, ధాన్యం కేంద్రాల వద్ద వడ్లు తడవకుండా కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినా, క్షేత్రస్థాయిలో అమలుకాకపోవడం విచారకరమన్నారు. సన్న వడ్లకే రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వస్తున్న వార్తలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- 27 రోజులు ఎదురుచూపులు



గోపాల్‌రావుపేటలో ధాన్యం కుప్పపై డీజిల్ పోసి నిరసన తెలుపుతున్న రైతు

## కడుపు మండి.. ధాన్యంపై డీజిల్ పోసి

- వడ్లకుప్పకు నిప్పంటించే యత్నం
- జగిత్యాల జిల్లాలో యువరైతు నిరసన

*జగిత్యాల రూరల్, మే 19: దాదాపు నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో ఓ యువరైతు కడుపు మండింది. ప్రభుత్వం, కేంద్రం నిర్వాహకుల తీరును నిరసిస్తూ వడ్ల కుప్పపై డీజిల్‌పోసి నిప్పుపెట్టేందుకు యత్నించగా తోటి రైతులు అడ్డుకున్నారు. జగిత్యాల జిల్లా గోపాల్‌రావుపేటకు చెందిన అంబటి సందీప్ తాను పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు 27 రోజుల క్రితం గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తెచ్చాడు. తూకం వేయకపోవడంతో అప్పటినుంచి ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర ఆవేదనకు లోనైన సందీప్ ఆదివారం తన ధాన్యం కుప్పపై డీజిల్ చల్లి నిప్పుపెట్టేందుకు యత్నించాడు. తోటి రైతులు గమనించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ.. అధికారులు, కేంద్రం నిర్వాహకులు ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డాడు. టోకెన్ల ప్రకారం కొనకుండా ఇష్టారాజ్యంగా తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.*

# ఎండబోస్తూ.. ఎత్తిపోస్తూ..

- 15 రోజులుగా కేంద్రాల్లోనే పడిగాపులు
- ఖాళీ బస్తాలూ ఇవ్వని నిర్వాహకులు
- అకాల వర్షాలతో తడిసి ముద్దయిన వడ్లు
- ధాన్యం ఆరబోసుకునేందుకు అష్టకష్టాలు

ఏటూరునాగారం/ములుగురూరల్, మే 19 : అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారు. తేమ లేకుండా ఉండేందుకు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షం పడటంతో మళ్లీ తిరగబోసుకోవాల్సి వస్తున్నది. ఆరబోసుకున్న ధాన్యంపై కప్పిన టార్పాలిన్లపై పేరుకుపోయిన నీటిని ఎత్తిపోయడం, షీట్లను దులిపి మళ్లీ కప్పుకోవడం రైతుకు దినచర్యగా మారింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకాలు జరగడం లేదు. ఈ క్రమంలో కురిసిన వర్షంతో ధాన్యం తడువగా, రైతులు ఆందోళన చెందుతున్నారు. లారీల కొద్దీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోశారు. దీనికితోడు వడ్లు నింపుకొనేందుకు ఖాళీ బస్తాలు కూడా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో టార్పాలిన్ షీట్లు తెప్పేసుకునేందుకు కూడా కూలీలను పెట్టుకోవాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ పాలనలో పండించిన పంట అమ్ముకోవడమూ రైతులకు కష్టంగా మారింది. క్వింటా వడ్లకు రూ. 500 బోనస్ ఎప్పుడిస్తారోనని ఎదురు చూస్తున్నారు. కాగా ములుగు రూరల్ మండలంలోని బండారుపల్లి శివారులో రైతులు తడిసిన వడ్లను ఆరబోశారు. మొలకలు వచ్చిన వడ్లను, మంచి వడ్లను వేరు చేసి ఎండబోస్తూ తంటాలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వడ్లను కాంటా వేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ షీట్లపై నిల్వ ఉన్న నీళ్లను ఎత్తుతున్న కూలీ

### 15 రోజులైనా కొనే దిక్కులేదు..



ఏటూరునాగారంలోని కొనుగోలు కేంద్రానికి తెచ్చి 15 రోజులైనా ధాన్యం కొంటలేరు. వడ్లు ఆరబోసి టార్పాలిన్ షీట్లు కప్పినా కింద నల్ల రేగడి భూమి కావడంతో తేమ ఎక్కువగా ఉంటుంది. వర్షం రాగానే కుప్పలపై పరదాలు వేస్తున్నాం. తర్వాత తీస్తున్నాం. రోజూ ఇదే పని అవుతున్నది. వడ్లు నింపుకొనేందుకు ఖాళీ బస్తాలు ఇస్తలేరు. ధాన్యం కొనకుంటే ఎట్లా? తేమ ఎక్కువగా ఉందని అంటున్నరు. ఈ వర్షాల నుంచి వడ్లను ఎలా కాపాడుకోవాలో అర్థమైతలేదు. ఇంకెన్ని రోజులు ఇక్కడ కుప్పలకు కాపలా ఉండాలో తెలుస్తలేదు. ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే మేం నిండా మునుగుడే.

- మాటూరి లక్ష్మయ్య, ఏటూరునాగారం



పాలకుర్తి: తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

పాలకుర్తి, మే 19: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని విస్నూర్, తొర్రూర్ గ్రామాల్లో అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యానికి ఇన్ని రోజులు కాంటా వేయకుండా ఉండలేదని గుర్తు చేశారు. మూడు నెలల నుంచి వడ్లు కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై మండిపడ్డారు. ధాన్యానికి బోనస్ ఇస్తామంటూ బోగస్ మాటలు చెప్పి రైతుల ఉసురు తీస్తున్నదని ఆరోపించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో ఐదు నెలల్లోనే అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న, దొడ్డు వడ్లు అనే తేడా లేకుండా వెంటనే అన్నింటికీ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పస్నూరి నవీన్, ఎంపీటీసీ మాటూరి యాకయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై సోయిలేని సర్కారు

**తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

ఖైరతాబాద్, మే 19: రాష్ట్రవ్యాప్తంగా అకాలవర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సోయి లేదని తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశంలో తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృధ్వీరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు అనేక పంటలు నీట మునిగాయని, చేతికొచ్చిన పంట తడిసిందని తెలిపారు. సరిపోను గోదాములు లేక రైతులు తమ పంట దిగుబడులను రోడ్లపై, పొలాల్లో, కల్లాల్లో రోజులు తరబడి పెట్టుకొని ధాన్యం విక్రయానికి ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఇదే అదునుగా దళారులు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని మార్కెట్ యార్డులో అమ్మకానికి పెట్టిన ధాన్యం సైతం కొనుగోలు చేయకుండా రైతులను వేధిస్తున్నారని, ఫలితంగా బాధిత రైతులు ఆందోళనలకు దిగుతున్నారని తెలిపారు. అయినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని విమర్శించారు. పంటనష్టపోయిన రైతాంగానికి కనీస పరిహారం అందే అవకాశం లేకుండా చేశారని, ప్రతి ఎకరాను పంటల బీమా కిందికి తేవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రుణమాఫీ హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ఇప్పటికే కనీస మద్దతు ధరను ప్రకటించకుండా తాత్సారం చేసిందని విమర్శించారు.

# మెదక్ జిల్లాలో భారీ వర్షం


### వికారాబాద్ జిల్లాలో పిడుగుపడి ముగ్గురి మృతి

అందోల్/శివ్వంపేట/చిన్నశంకరంపేట/యాలాల, మే 19: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆదివారం పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కల్లాలు, రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సైతం ధాన్యం తడిసింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శివ్వంపేట కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలపై కవర్లు కప్పడంతోపాటు అక్కడ వరదనీరు నిల్వకుండా రైతులు పారలతో కాలువలు తవ్వారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో రాత్రి ఈదురు గాలులు వీచాయి. చందాపూర్ గ్రామ శివారులో ఈదురుగాలికి కరెంటు స్తంభం నేలకూలింది. మండలంలోని అంబాజిపేట, రుద్రారం, చందంపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది.



సంగారెడ్డి జిల్లాలోని జోగిపేటలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సంగారెడ్డి జిల్లా జోగిపేట-సంగారెడ్డి ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. రైతులు రోడ్లపై, కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వికారాబాద్ జిల్లా యాలాల మండలంలో రెండుచోట్ల పిడుగు పడి ముగ్గురు మృతి చెందారు. మండల పరిధిలోని బెన్నూరుకు చెందిన గొల్ల ఎంకప్ప (60), జుంటుపల్లికి చెందిన మంగలి శ్రీనివాస్ (26), కొన్నింటి లక్ష్మప్ప (45) పిడుగుపాటుకు గురై మృతి చెందారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో మహిళా రైతుతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి. చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు

## అన్నిరకాల వడ్లకు 500 బోనస్ ఇవ్వాలి

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

మర్కూక్, మే 19: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే వేలాది మంది రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో గౌరారం దగ్గర రాజీవ్ రహదారిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం బీఆర్‌ఎస్ మర్కూక్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డితో కలిసి సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో రైతుల కల్లాల వద్దకు వెళ్లి తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని, క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించామని, కొన్న ధాన్యానికి రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమచేశామని గుర్తుచేశారు. మండలంలో దాదాపు 50 లారీల ధాన్యం రోడ్లపైన ఉందని పేర్కొన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి వేగంగా ధాన్యం సేకరణ పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, మేకల కనకయ్య, అచ్చంగారి భాస్కర్, సంతోష్‌రెడ్డి, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.